# ఎఱ్ఱ మట్టి దిబ్బలు



తుంతరా తుళ్ళుతూ బస్సులోంచి వెలిసిన సముద్రపు చేపల్లా ఒక్కుతోంచి బయటపడ్డారు ఆడపిల్లలంతా. ఆ క్షణం భీమునిపట్నం బస్‌స్టాండ్ ఒక అందాల సంత. అదంతా ఒక ఫాషన్ పెరేడ్. కంటకింపాడే కన్నెపిల్లలంతా గువ్వపిట్టల్లా కువకువలాడు తున్నారు. సృష్టిలో అందమంతా యౌవనంలో ఉంటే యౌవనం అక్కడ విరజిమ్ముతూ ఉంది. సృష్టిలో ఉండే ఉల్లాసమంతా యౌవనంలో ఉంటే ఉల్లాసం అక్కడ ఊరేగింపు చేస్తూంది. సృష్టిలో ఉండే నైర్మల్యమంతా కన్నెతనంలోనే ఉంటే అక్కడ నైర్మల్యం నిశ్శబ్ద సంగీతం వినిపిస్తూంది.

ఎక్కువమంది ఇరవై సంవత్సరాల లోపు వాళ్ళు. రంగు రంగుల బట్టలతో, రకరకాల ఫాషన్లతో గులాబీలు, సంపెంగలు, చామంతులు, సన్నజాజులు, బొండుమల్లెలు, ముద్దమందారాలు కలిపి గుచ్చెత్తి ముగ్గులు జల్లినట్లు అక్కడే తిరుగుతున్నారు.

దూరంనుంచి నవ్వుల నురగలతో ఎదురుగా ఎగిసిపడి స్వాగతం చెప్పే సముద్రపు పొంగుల్లా చిలిపి చేష్టలు బయటపడుతూంటే పసిపిల్లల్లా గెంతులు వేస్తూ కేరింతలు కొట్టుతున్నారు. ఒక్క ఆడపిల్ల నట్టింట నికేతనే ఆనందం చిందులు వేస్తుంటుంటారు. అందరు పిల్లలొక్కసారి పొంగిపొరలే ఆనంద వాహినులుగా ఉక్కిరి బిక్కిరి చేసేసరికి బీద భీమునిపట్నం బస్‌స్టాండ్ తమాయించుకోలేక పోయింది. వాళ్ళను ఆదరించి ఆతిథ్య మిచ్చే తాహతు దాని కెంత మాత్రం లేదు. ఒక సామాన్యమైన హోటలు, రెండు టీ బడ్డీలు, నాలుగు కిళ్ళీకొట్లు, ఎదురుగుండా శిథిలమైన పడవ్ బిల్డింగు— ఇదే భీమునిపట్నం బస్‌స్టాండ్. పూట గడవని బీదవాడింటికి సంపన్నులైన బంధువర్గం చెప్పా చెయ్యకుండా వచ్చి పడ్డట్టయింది.

''ఓయ్! కొబ్బరి బొండాలోయ్!'' అంటూ తెరీసా చిన్న పిల్లలా ఒక కిళ్ళీ బడ్డీ దగ్గరకు పరుగెత్తింది. ఆ వెనకే అందరూ పరుగులు తీశారు. అక్కడున్న కొబ్బరి బొండాలన్నీ క్షణంలో అయిపోయాయి. వైజాగ్‌లో వాళ్ళకు దొరకనిది—భీమిలిలో దొరికేది అదే కాబోలు!

విశాలమైన ఆంధ్రా యూనివర్సిటీ ఆవరణలోకి, గరల్స్ హాస్టల్ గదుల లోకి తెరలు తెరలుగా వచ్చి పడే సముద్రపు గాలి కరళ్ళుకన్నా భీమునిపట్నం మెయిన్ రోడ్డులోంచి సముద్రపు ఒడ్డుకి చేరుకునే టప్పుడు జుట్టు లేపి, పైటలు ఎగర గొట్టి, పరికిణీలు మీదకు లేపి అల్లరి

చేసే తుంటరి గాలిపిల్లలు వాళ్ళకు వెర్రి సంతోషాన్ని పుట్టించాయి. కెమేరాలు, ట్రాన్సిస్టర్లు, టేప్ రికార్డర్లు, ఫ్లాస్కులు, పళ్ళు, జామ్‌లు, బిస్కట్లు — అన్నీ అందరి బుజాల మీదా తలా ఒకటి వేలాడుతూంటే బీచ్‌లో చెల్లాచెదురుగా నడకలు సాగించారు. వైజాగ్‌లో ఇంత విశాలమైన సముద్ర తీరం వాళ్ళకు కనపడలేదు. వైజాగ్‌లో సాయంత్రంపూట సరదా కోసం బీచ్‌కి వచ్చే రంగు రంగుల మనుషుల్ని చూశారు వాళ్ళు. ఇక్కడ జీవన సముద్రంలో సంసార నావలు నడిపే పల్లెవాళ్ళు తీరమంతటా ఎవరి పనిలో వాళ్ళు నిమగ్నులై కనిపిస్తున్నారు. అప్పుడే తీసిన వలలోంచి చేపలు దులిపి అమ్మకం చెయ్యడం వాళ్ళకు చాలా ఆసక్తి కలిగించింది. సముద్రమంతటి ఆస్తి ఉండగా ఆ పల్లెవాళ్ళు నిరుపేద లెందు కయ్యారో వాళ్ళ కర్థం కాలేదు. చిన్న పడవలాగుండే కర్ర దుక్కను సముద్రంలో దింపి ఒడ్డునే దాన్ని తెడ్డుతో ముందు వెనకలకు నడుపుతూ, మీద పడే అలల తాకిడికి తట్టుకుంటూ జీవన సమరానికి శిక్షణ పొందే బాలసైనికుల్లాంటి పల్లెవాళ్ళ పిల్లలు వాళ్ళను పిచ్చిగా ఆకర్షించారు. వాళ్ళ ధైర్యం చూసి అంతా ఆశ్చర్య పోయారు. పొంగి వచ్చే అలలు వాళ్ళని తమ ప్రవాహంతో వీళ్ళపోంచి నడకను సాగించారు.

ఒంటిమీద బట్టలు లేకుండా నీళ్ళలో తడుస్తున్న పల్లెవాళ్ళ పసిపిల్లల్ని పిలిచి, కరుణ వాళ్ళందరికీ బిస్కట్లు పంచింది. ఆవిడ మిగిలిన వాళ్ళందరి కంటే వెనకగా ఒంటరిగా నడుస్తోంది. అంత ఆప్యాయంగా తమని పిలిచి బిస్కట్లు పంచిన వాళ్ళెవరూ లేరు కాబోలు — ఆ పిల్లలు కరుణ వెనకే నడుస్తున్నారు. ఆవిడ వాళ్ళను ఏవేవో ప్రశ్నలు వేస్తోంది. వాళ్ళు చెప్పిన చోట సమాధానం చెప్తున్నారు. అర్థంకానిచోట వెర్రి ముఖం పెట్టుకుని చూస్తున్నారు. అమాయకమైన వాళ్ళ ముఖాలను చూస్తూ, అలనా పాలనా లేని వాళ్ళ బ్రతుకులను గూర్చి ఆలోచిస్తూ, బాధామయమైన వాళ్ళ భవిష్యత్తును తలుచుకుని బాధ పడుతూ కరుణ తన స్నేహితులందరినీ మరిచిపోయింది. ఏదో ముంచెత్తేద్దామనే మహోత్సాహంతో అతి వేగంగా ముందుకు తోసుకువచ్చి హద్దు దాటలేక వెనక్కి విరిగి పడే సముద్రపు కెరటాల్లా ఇలాంటి వాళ్ళ సంపదనూ ఉద్ధరించాలనే తీవ్రమైన తపన, కట్టుబాట్ల హద్దులు దాటలేని నిస్సహాయత కరుణ మనసులో కల్లోల తరంగాలను రెచ్చగొట్టాయి.

"కరుణా! కమాన్! క్విక్!" దూరం నుండి థెరీసా బిగ్గరగా పిలుస్తోంది. అన్యమనస్కంగా పిల్లలతో బాటు నడుస్తున్న కరుణ ఆ పిలుపుతో ఒక్కసారి తేరుకుంది. వాళ్ళందరూ అప్పుడే ఇసుక దిబ్బలు దాటి రోడ్డుమీంచి సరుగుడు తోటలోకి చేరుకున్నారు. కరుణ వేగంగా

**యు. ఎ. నరసింహమూర్తి**

నడిచింది. ఇసుకలో నడక. అదొక అనుభూతి. తోటలోకి చేరుకునే సరికి అంత సముద్రపుగాలిలోనూ కరుణ ముఖం నిండా చెమటలు పట్టాయి. రుమాలుతో ముఖం తుడుచుకుంది. ప్రయాణంలో ముఖంమీద పడిన దుమ్ము వల్ల కాబోలు ముఖమంతా మండినట్లుంది.

"ఏమిటి,కరుణా, ఇంతాలస్యం? ఇష్టం లేనిదాన్ని తీసుకువస్తే ఇలాగే ఉంటుంది కాబోలు. ఇంతకంటె ఆహ్లాదకరమైన వాతావరణ మింటుందా? ఇంతకంటె సంతోషకరమైన సన్నివేశా లుంటాయా? ఇలాంటప్పుడైనా హాపీగా ఉండవేం?" అంది థెరీసా.

"ఏం లేదే! ఆ పిల్లలేవో కబుర్లు చెపుతూంటే వింటున్నాను. మీరు నడవ లేకపోయారా" అంది కరుణ నవ్వుతూ.

సరుగుడుచెట్ల మధ్యనుండీ గాలి ఈలలు వేస్తోంది. ఆ చెట్లు నాట్యం చేస్తున్నట్లు ఊగుతున్నాయి. అందుకే కాబోలు వీటిని సంగీతపు చెట్లంటారు అనుకున్నారు వాళ్ళంతా. ఆ సరుగుడు చెట్ల మధ్యనుండీ మెత్తటి ఇసుకతో కూడిన కాలిబాట, గాలిపాట వాళ్ళను పరవశింప చేస్తున్నాయి. అందరూ కూర్చున్నారు. ఏపిల్స్ కోసుకుని తింటున్నారు. ఫ్లాస్కులోంచి ఒంపుకుని కాఫీలు తాగుతున్నారు. థెరీసా ఒక కప్పు కాఫీ తెచ్చి కరుణ కిచ్చింది. అప్పటికే అలిసి పోయిన కరుణకు ఆ కాఫీ కొంచెం రిలీఫ్ ఇచ్చింది.

కొందరమ్మాయిలు సరుగుడు తోటలో పరుగులు పెడుతూ దొంగాట లాడుతున్నారు. కొందరు వంగిన కొమ్మల్ని చేత్తో గుంజుతూ సంతోషిస్తున్నారు.



కొందరు సంగీతం వింటున్నారు. నలుగు రైదుగురు ఫోటోలు తీస్తున్నారు. ఎవరికి వారే అందరితో కలిసి ఆనందిస్తున్నారు. కరుణ మాత్రం నిశ్శబ్దంగా కూర్చుని అందరి వేపూ చూస్తూంది.

"ఏమర్రా! హోటల్లో దిగిన పెళ్ళి వారిలా ఈ సరుగుడు తోటలోనే ఉండి పోతామా? ఎర్రమట్టి దిబ్బలు చూస్తామా? ఆలస్యమై పోతూంది. కదలండి వేగం" అని అందరినీ కూడగట్టుకుంటూంది థెరీసా. ఆవిడ వాళ్ళ నాయకురాలు.

"థెరీసా! కేవలం మనమే వెళ్ళేకంటె ఎవరైనా తెలిసిన మనిషి నొకణ్ణి తీసుకు పోవడం మంచిదేమో?" అంది వసంత. నిజమే ననిపించిం దందరికీ. కాని, మని షెక్కడ దొరుకుతాడు? థెరీసా, వసంత రోడ్డు దాటి సముద్రపు ఒడ్డుకొచ్చారు. అక్కడొక మనిషి కనిపించాడు.


"ఏమయ్యా! నీ పేరేమిటి?" అంది థెరీసా.

"సోములమ్మా. ఏంది గావాల్నమ్మా?" అన్నాడు సోములు మర్యాదగా.

"ఏం లేదు. ఎర్రమట్టి దిబ్బలు చూడాలని ఈ ఊరు వచ్చాము. నీకు వీలైతే మాకు తోడుగా వచ్చి చూపించ గలవా?" అంది థెరీసా మొహమాటంగా.

"చూపించేదానికేముం దమ్మా ఇందులో. ఆ సరివితోట దాటితే అన్నీ ఎర్రమట్టిదిబ్బలే గందా! పదండి. ఆడ కూతుళ్ళు. పదండి" అంటూ సోములు తోటవేపు దారి తీశాడు.

అంచెలుగా ఎర్రమట్టి దిబ్బల వేపు నడిచారు. అదంతా ఒక పెద్ద బయలు. అంచులో మెరకలంగా మట్టితో ఎత్తైన దిబ్బలు, లెక్కలేనన్ని గుట్టలు ఒక దానికొకటి కలిసి ఉన్నాయి. వాటిమధ్య మెత్తటి సముద్రపు ఇసుకలో ఎన్నో సన్నని తోవలు. పూర్తి పక్వానికి రాని జీడి మామిడి చెట్ల వాసన. ఒక పక్క ఎత్తైన దిమ్మలు కొండ. ఒక పక్క గంభీర ఘోషతో సముద్రం. అప్పటి దాకా జీడి మామిడిచెట్ల నీడలో హాయిగా పడుకుని చెవులు నిక్క పెట్టుకుని, బేలకళ్ళతో కూర్చున్న కుందేలుపిల్ల, వీళ్ళ అలికిడి వినగానే చెంగు చెంగున పరుగు తీసింది. థెరీసా అందరినీ విడిచిపెట్టి దాని వెనక పరుగెత్తుతూ ఎర్రమట్టి దిబ్బల మధ్య లోకి పోయింది. అందరూ దిబ్బల్లోకి పరుగెత్తారు. అక్కడ అన్నీ తోవలే. ఏ తోవలోంచి వెళుతున్నారో, ఎటు వేపు వెళుతున్నారో తెలియకుండా పోతుంది. ఆ తోవలన్నీ ఒక పజిల్‌లాగున్నాయి.




కరుణ నెమ్మదిగా దిగి ఇసుకలో నడుస్తూంది. ఆవిడ ముఖం నిండా చెమటలు పట్టాయి. ఏ తోవలోంచి వచ్చిందో థెరీసా, కరుణని పట్టుకుని కౌగిలించుకుంటూ ఉక్కిరి బిక్కిరి చేస్తూ ఒక దిబ్బమీదకు తీసుకుపోయింది.

"కరుణా! ఇంత అందమైన చోటు ఈ ప్రాంతంలో ఉంటే నా కిన్నాళ్ళ దాకా చెప్పవు కాదేం? ఈ రోజు నా జీవితంలో మరిచిపోలేను. ఇక్కడెంత ప్రశాంతంగా ఉంది!" థెరీసా సంతోషానికి పట్టపగ్గాలు లేవు. కరుణ చిరునవ్వు నవ్వుతూంది.

"చలంగారిక్కడే కూర్చుని కథలు వ్రాసేవారట గదా? నీకు తెలుసా?" అంది థెరీసా.

"ఏమో? ఈ ఊళ్ళో మాత్రం ఉండేవారు" అంది కరుణ.

"తప్పకుండా రాసే ఉంటారు. ఈ వాతావరణం చూస్తే నాకే రాయాలనిపిస్తూంది" అంది థెరీసా.

"ఇప్పుడేటి సూసినమ్మా సొగసు! వాన కురిసినప్పుడు, వెన్నెల గాసినప్పుడు సూడాల. ఓనాడితే ఈ తోవ లన్నింటి నిండా నీరు కమ్ముకొస్తా ఉంటాది. దిబ్బలు వాన జెల్లలు రాలుస్తా ఉంటయి. ఇక వెన్నెల సంగతి సూడాలే గాని, సెప్పడాని కెల్లగాదు" అన్నాడు సోములు.

"అవునా! అంత బాగుంటుందా! అయితే తప్పకుండా మళ్ళీ రావాలి" అంటూ థెరీసా తాను నిలబడ్డ దిబ్బమీంచి దిగి ఎదురుగా ఉన్న ఒక దిబ్బలో గూడులా ఉన్న దారివేపు పరుగెత్తింది.

"థెరీసా! థెరీసా! వద్దు! వద్దు! డోంట్ గో దేర్!" అంటూ కరుణ ముందు కడుగు వేసింది. ఆవిడ దిబ్బ మీంచి కింద పడవలసిందే. కాని, "అమ్మాయిగోరూ!" అంటూ పక్కనే ఉన్న సోములు ఆవిడ జబ్బ గట్టిగా పట్టుకుని వెనక్కి గుంజాడు. పురుష స్పర్శతో కరుణ ఒళ్ళంతా పెట్రోలు పోసి అంటించినట్టు భగ్గుమంది. ఆవిడకి స్పృహ తప్పింది. థెరీసా ఒక్క అంగలో చేరుకుంది. ఆడపిల్లలంతా గాభరాగా పరుగెత్తుకొస్తున్నారు. కరుణని చేతుల మీద సాయం పట్టి సరుగుడు తోటలోకి తీసుకొచ్చారు. వాటర్ బాగ్ లోంచి నీళ్ళు తీసి ముఖం మీద జల్లారు. చల్లటి గాలి వీస్తూనే ఉంది. కాని, అరగంట దాటినా కరుణకు తెలివి రాలేదు. థెరీసాకు ఆదుర్దా ఎక్కువయింది.

"సోములూ! బస్ స్టాండ్‌లో మా బస్ ఉంటుంది. నువ్వు వెళ్ళి దాన్ని ఎలాగైనా ఈ రోడ్డు దాకా తీసుకు రమ్మని చెప్పగలవా?"

థెరీసా చెప్పగానే సోములు బస్‌కోసం వెళ్ళాడు.

"బస్ రాగానే నేను కరుణని తీసుకు వెళతాను. ఊళ్ళో టాక్సీ దొరికితే నేను హాస్పిటల్‌కి పోతాం. మీరు పిక్నిక్ పూర్తిచేసుకుని రండి. వసంతా! నువ్వు అందరినీ జాగ్రత్తగా చూడు" అని థెరీసా చెప్తూంది. వాళ్ళంతా కూడా వచ్చేస్తామన్నారు. కాని, థెరీసా ఇష్టపడ లేదు. ఇంతలో బస్ వచ్చింది. థెరీసా కరుణను బస్సెక్కించుకుని ఊళ్ళోకి వెళ్ళింది. బస్‌స్టాండుకు చేరుకుం టూండగా కరుణకు తెలివి వచ్చింది. కాని, బాగా నీరసంగా ఉంది. మాట్లాడలేదు. థెరీసా హాండ్ బాగ్ లోంచి రెండు గ్లూకోజ్ టాబ్లెట్లు తీసి ఆవిడ నోట్లో వేసింది. ఫ్లాస్క్ లోంచి కాఫీ ఇచ్చింది.

"డ్రైవర్! ఇక్కడ డాక్టరెవరైనా ఉన్నారేమో చూడు" అంది థెరీసా.

"వద్దు. ముందు హోటల్‌కి పోదాం. ఫరవాలేదులే" అంది కరుణ.

ఆ సమయానికి వైజాగ్ తిరిగి వెళ్ళే టాక్సీ ఒకటుం దక్కడ. దానిమీద బయలుదేరి ఇద్దరూ హోటల్‌కి చేరుకున్నారు.

థెరీసా రూమ్ తాళం తీసి పక్క సర్ది కరుణని పడుకోమని చెప్పి కిటికీ రెండూ తెరిచింది. సముద్రపు గాలి రయ్యిమని గదిలో ప్రవేశించింది. థెరీసా పోయి డాక్టర్‌కు ఫోన్ చేసింది. కొద్ది సేపట్లో డాక్టర్ వచ్చి ఎగ్జామిన్ చేసింది.

"బాగా నీరసంగా ఉంది. అంతే మరేం ఫరవాలేదు. ఏమైనా షాక్ తిందా?" అని ప్రశ్నిస్తూ ఇంజెక్షన్ చేసింది.

"అబ్బే! ఏం లేదండీ!" అంది థెరీసా. డాక్టర్ వెళ్ళిపోయింది.

"థెరీసా! నీ సంతోషాన్నంతా భగ్నం చేశాను కదూ?" అంది కరుణ.

"ఎందుకని? ఏం లేదులే" అంది థెరీసా.

"పోయిన జన్మలో చేసిన పాపం ఎర్ర మట్టి దిబ్బల్లో దాగివున్నట్లుండి, దాగకుండా నా వెనకాల రావడాని కొచ్చింది" అంది నీరసంగా.

"నువ్వలా మాట్లాడకు. నీకన్నా? అయినా, నే నెరుగని నువ్వు ఇష్టపడి నాటి రాత్రి ఎర్రమట్టి దిబ్బలు చూడాలని నిశ్చయించుకున్నాను. అప్పుడు నిన్ను

కూడా తీసుకుపోతానురే. తనివితీరా ఆ అందాన్ని అనుభవిద్దాం.'' థెరిసా ఇలా చెప్పుకుపోతూ ఉంటే కరుణకు మళ్ళీ ముఖం నిండా చెమటలు కమ్ముకుతున్నాయి.

''పద్దు, థెరూ! నిన్ను బ్రతిమాలు కుంటున్నాను. ఐ ప్రే యు! అలాంటి ఊహ తలపెట్టకు'' అంటూ వణికి పోతూంది. థెరిసా ఆవిడ వేపు చూడక పోవడం చేత "ఏమిటోయ్! ప్రతిదానికీఅడ్డు వేస్తావ్! పొద్దున్నే సముద్రంలో సన్ రైజ్ చూద్దామంటే బ్రెకేస్ మీదకు రావు. మూన్ లైట్ డిన్నరంటే పడ దంటావు. ఎన్టీ రామారావు బొమ్మ చూపిస్తే మెచ్చుకోవు. ఘంటసాల పాటకు స్పందన పొందవు. అయినా, నిన్నని ఏం లాభం? అసలు కళా హృదయం ఉండాలి'' అంది బాగా ఉద్రేకంగా.

''అవును, థెరూ! నిజం చెప్పావు. మనిషన్నాక దేన్నన్నా మెచ్చుకునే శక్తి ఉండాలి. కాని, నా మనస్సు చచ్చిపోయింది. జలప్రవాహానికి కోరుకుపోయి, గండ్లు పడ్డ ఎఱ్ఱి మట్టి దిబ్బల్లాగే కన్నీటితో కోసుకుపోయి, గండ్లు పడ్డ నా కళా హృదయం చచ్చిపోయింది.''

ఆ మాటలతో థెరిసా చలించి పోయి గబుక్కున వెనక్కి తిరిగింది. కరుణ మంచం మీద కూర్చుని, ''కరుణా! ఏమయింది నీకు? నిన్ను కష్టపెట్టానా? ప్లీజ్! ఎక్స్‌క్యూజ్ మి. నన్ను క్షమించు'' అంటూ గడ్డం పట్టుకుని బ్రతిమాలు తూంది.

కరుణకు దుఃఖం ప్రవాహం లాగా ముంచుకు వచ్చింది. థెరిసా ఎంతలా బ్రతిమాలుతూన్నా, ఆవిడ అలా ఏడు స్తూనే ఉంది. థెరిసాకు ఏమీ చెయ్య డానికి పాలుపోవడం లేదు. ఈ ఏడాది స్నరలో కరుణ ఆవిడకు ప్రాణ స్నేహితురా లయింది. కరుణకు బాధ కలిగితే ఆవిడ సహించలేదు.

మొదట కరుణను ఎంత బ్రతిమా లినా అసలు ఎఱ్ఱమట్టి దిబ్బలకు రానంది. చివరకు థెరిసా తన స్నేహాన్ని వదులుకో కుండా ఉండాలంటే రాక తప్పదని ఆంక్ష పెట్టింది. ఏదోవిధంగా కరుణను ఆనంద పరచాలని ఆవిడ ప్రయత్నం. అందుచేతే కరుణ బయలుదేరక తప్పింది కాదు. దాని పరిణామం ఈ విధంగా తయారయింది. థెరిసా మనసంతా వికలమయి పోయింది. ఈ రోజు ఎందు కిలా మారిపోయింది? అని విచారిస్తూ కూర్చుంది.

కొంతసేపటికి దుఃఖాన్ని అదుపులో పెట్టుకోగలిగింది కరుణ. ''థెరూ! నీ కొక విషయం చెప్పకపోతే మళ్ళీ నువ్వెప్పు వెన్నెల రాత్రి పూట ఎఱ్ఱమట్టి



దిబ్బలకు వెళ్ళితీరతావు. నే చెప్పేది విన్నాక వెళ్ళగలిగితే వెళ్ళు.

నాకు కళా హృదయం లేదన్నావు కదూ? పొరపాటు పడ్డావు. లేకపోలేదు. చిన్నతనమంతా పైరు చేలలో, మామిడి తోటల్లో తిరుగుతూ, ఊడుపుల్లో, దమ్ముల్లో 'నోమినాచందనాలో' పాటల్లో ఆడ కూలీలతో గొంతు కలుపుతూ, ఏటిలో స్నానాలు చేస్తూ గడిపాను. తెల్ల వారి లేచేసరికి పెరట్లో ముద్దబంతి పూవు పూస్తే, తోటలో కోయిలమ్మ గొంతు కదిపితే నాకు కొత్త బట్టలు కట్టుకున్నట్టు, పళ్ళరసం తాగుతున్నట్టు అనిపించేది. చీకుచింతలకు మా ఇంటి పరిసరాల్లో చోటు లేదు. చదువుకోసం అన్నయ్య దగ్గర చేరిన తొలి రోజుల్లోనే నాయుడుగారి ఫిడేలు, ఈమనివారి వీణాగానం, బాలమురళి గాత్రం...ఇలాంటి పెద్ద పెద్ద సంగీత కచేరీలు వినే అవకాశం లభించింది. అందుకే కొపోలు నేను వీణ బాగా నేర్చుకో గలిగాను.

మా ఊళ్ళో బాపు బొమ్మల ప్రద ర్శనం జరిపి నప్పుడు నేను కార్యకర్తగా కూడా పని చేశాను. 'తలనిండ పూదండ దాల్చిన రాణి', 'మాట్లాడే మల్లె మొగ్గ మాదిరిగా నడిచిరా' — ఇలాంటి పాటలు పిచ్చిదానిలా పాడేదాన్ని. ఆ రోజుల్లో ఉండే ఉత్సాహంతో కొండల్ని కదిలించే శక్తి ఉండేది. ఇదంతా గొప్పకోసం చెప్పు కుంటున్నా ననుకోకు.

నువ్వు నాకు కళాహృదయం లేద న్నందుకు నేను బాధపడటంలేదు. కాని, ఆ కళాహృదయమే, ఆ సౌందర్యా రాధనే నా జీవితాన్ని దెబ్బకొట్టింది. కేవలం సౌందర్యారాధన వల్లనే నేను కాంతి ప్రసాద్‌ను ప్రేమించాను.

శాంతి పెగవాళ్ళు కూడా మెహా పెట్టే యువకుడు. సంగీత సాహిత్యాల్లో, మంచి అభిరుచి ఉన్నవాడు. అప్పుడు ఇంజనీరింగ్ ఫైనల్ చదివేవాడు. బాపు చిత్రకళా ప్రదర్శనం ఏర్పాటుచేసిన రోజే మొదటి సారి నా కతనితో పరిచయ మయింది. క్రమంగా ఆ పరిచయం వృద్ధి పొందింది. మేము స్వేచ్ఛగా తిరిగే వాళ్ళం.

ఆ రోజుల్లోనే నేను మొదటిసారి శాంతితో కలిసి ఎఱ్ఱమట్టి దిబ్బలు చూడటానికి వెళ్ళాను. ఆ సముద్రపు తీరం, రకరకాల చేపలు, పల్లెవాళ్ళ జీవితం, సరుగుడు తోట, జీడి మామిడి మొక్కలు, తోవ తెలియనివ్వకుండా గజిబిజి చేసే ఎఱ్ఱమట్టి దిబ్బలలోని తోవలు — ఇవన్నీ చూసి మేము పొందిన ఆనందం చెప్పలేను.



శాంతి, నేను అక్కడి వింతలేవీ నాగరికపు మెట్లలా ఆడాము. పొద్దున్నే వెళ్ళి సాయంత్రం దాకా అక్కడే గడిపాము. ఒకటి పదురూ ఉంటే తిరిగి వచ్చాము.

అప్పుడు నేను బి. ఎ. ఫైనల్ చదివేదాన్ని. మర్నాడు కాలేజీలో కలిసి నప్పుడు రమామణికి ఎఱ్ఱమట్టి దిబ్బలు గురించి చెప్పాను. అంతా విని రమ- 'పగలు చూస్తేనే ఆ ప్రదేశం నీ కంత బాగుంది. ఎఱ్ఱమట్టి దిబ్బల్ని చూస్తే వాన కురుస్తున్నప్పుడు గాని, వెన్నెల రాత్రిపూట గాని చూడాలి. ఒక పౌర్ణమినాడు మేమంతా వెళ్ళి చూశాము' అంది. అలా చాలామంది చూస్తూ ఉంటారంది.

అది మొదలు నాకు పున్నమి వెన్నెట్లో ఎఱ్ఱమట్టి దిబ్బల్ని చూడాలని గాఢమైన కోరిక కలిగింది. ఎలాగైనా చూసి తీర జనుకున్నాను. శాంతితో చెప్పాను. నేను ఏమి చెప్పినా అతను కాదనేవాడు కాదు. కాని, ఆ కోరిక తీర్చడానికతడు సుతరామూ అంగీకరించలేదు.

'కరుణా! నీకు తెలియదు. రాత్రిపూట వెళ్ళి చూడడానికి తగిన సదుపాయా లేమీ అక్కడ లేవు. చీకటయిన తరవాత అలాంటి స్థలాలకు వెళ్ళడం ప్రమాదం' అన్నాడు.

'నీ భయంగాని,మనల్నెవరేమి చేస్తారు? అంతగా అయితే సాయంత్రమే వెళ్ళి తొమ్మిది గంటలదాకా ఉండి వచ్చేద్దాం' అన్నాను.

కాని, ఎంత చెప్పినా అతను వినలేదు. నాకు భరించలేని కోపం వచ్చింది. కొన్నాళ్ళు అతనితో మాటలాడటం మానేశాను. ఆ తరవాత ప్రతి పున్నమి నాడు నా కోరిక విజృంభించేది. శాంతిని అడుగుతూనే ఉండేదాన్ని. అతను కాదనే వాడు. అలా ఎన్నో పున్నములు గడిచాయి.

ఆ రోజు ఆశ్వయుజ పౌర్ణమి. ఆ రోజే నా పుట్టినరోజు. శాంతికి అంతకు ముందు రోజు ఇంజనీరుగా ఉద్యోగం వచ్చింది. వారం రోజులలోగా ఢిల్లీ వెళ్ళిపోవాలి. అతను చాలా ఉత్సాహంగా ఉన్నాడు. నా దగ్గరకు వచ్చి 'కరుణా! ఈ రోజు పుట్టినరోజు కానుకగా నీ కేం కావాలో కోరుకో' అన్నాడు కౌగిట్లోకి తీసుకుంటూ.

నా కోరిక మళ్ళీ విజృంభించింది. 'ఆశ్వయుజ పౌర్ణమి నాటి వెన్నెట్లో తాజ్‌మహల్ చూస్తే బాగుంటుం దంటారు. మనం కనీసం భీమునిపట్నం పోయి రాత్రి వెన్నెట్లో ఎఱ్ఱమట్టి దిబ్బల్ని చూదాం' అన్నాను.

అతను ఏమనుకున్నాడేమో నాకు తెలియదు. కాదనలేక పోయాడు. 'సరే! పద!' అన్నాడు.

ఆ సాయంత్రం భీమునిపట్నం చేరుకున్నాము. మేము సముద్రతీరానికి చేరుకునేసరికి ఏడున్నర గంట అయింది. పున్నమి చంద్రుడు వెండి వెలుగు విరజిమ్ముతున్నాడు. చుట్టూ పెద్ద గుడి కట్టుకున్నాడు. సముద్రం మంచి పోటుగా ఉండి కెరటాలతో విరుచుకు పడుతూంది. ఎక్కడో ఒకటే, అరా తప్ప మనుష్య సంచారం లేదు. ఇసుక తడిగా ఉంది. నడక వేగంగా సాగుతూంది. కాని, ఆ ప్రదేశంలో ప్రవేశించిన దగ్గిర నుండి ఏదో భయం నన్ను కమ్ముకుంటూంది తమాయించుకుంటూ నడుస్తున్నాను. రోడ్డు దాటి సరుగుడు తోటలోకి చేరుకున్నాము. కప్పలు చెవుల బద్ద లయ్యేలా అరుస్తున్నాయి. గాలికి ఊగే సరుగుడు చెట్ల చివళ్ళనుండీ నీళ్ళు రాలుతున్నాయి. చెట్లు కదిలినప్పుడల్లా నన్నని గళ్ళులా, గీతల్లా పడే వాటి నీడలు నీటిమీద, నేలమీద కదులుతున్నాయి. అదంతా చూసి నా అడుగుండె ఆగిపోయింది. అడుగు ముందుకు పడలేదు.

శాంతిని పట్టుకుని, 'వెనక్కి పోదాం. మరి నేను రాలేను. నాకు భయం వేస్తూంది' అన్నాను.

'ఇంతదాకా వచ్చి వెనక్కి పోతావా! ఈ వాతావరణం ఎంత బాగుందో చూశావా! కావాలంటే ఒక్కసారి ఎఱ్ఱమట్టి దిబ్బల్లోకి వెళ్ళి వెంటనే వచ్చేద్దాం' అన్నాడు శాంతి.

నేను మళ్ళీ వద్దన్నాను. శాంతి లాలించి, బుజ్జగించి నన్ను ముందుకు నడిపించాడు. నా కోరిక తీర్చాలని అతని ఆశ.

సరుగుడు తోట దాటేసరికి కొత్త లోకంలో ప్రవేశించినట్లనిపించింది. వెన్నెల్లో ఎఱ్ఱమట్టి దిబ్బలు! ఎన్నాళ్ళ నుండో తీరాలనుకున్న కోరిక! ఆ సౌందర్యం నేను చెప్పలేను. శాంతికూడా ఆ ప్రదేశాన్ని చూసి ఒళ్ళు మరిచి పోయాడు. ఒక్క క్షణంలో మా కే భయమూ లేకుండా పోయింది. ఆ ప్రదేశమంతా తనివితీరా స్వేచ్ఛగా, సంతోషంగా తిరిగాము. గంట గడిచేసరికల్లా వెన్నెల మసకబారింది. అది గుర్తించి, 'శాంతీ! వాన వచ్చే టట్లుంది. ఇక పోదాం' అన్నాను.


'ఇంత వేగంగా రాదులే. క్రిందటి సారి మనం వచ్చినప్పుడు దాగిరి ముచ్చు లాట ఆడుకున్నాం, జ్ఞాపకముందా? ఈ రోజుకూడా ఆడుకుని పోదాం' అన్నాడు చిలిపిగా.

నాకూ అలాగే అనిపించింది. ఆటలో కాలం సంగతి జ్ఞాపకం లేకుండాపోయింది. ఆఖరుగా శాంతి తాను దాక్కుంటా నన్నాడు. నన్ను వెతకమన్నాడు. అలాగే కని మూసుకున్నాను. అతను వెళ్ళిపోయాడు. నేను వెతకడం ప్రారంభించాను. చినుకులు పడడం ప్రారంభించాయి. నాకు భయం వేసింది. వేగంగా వెతికాను. పది నిమిషాలు వెతికాను. శాంతి దొరకలేదు. వాన ఎక్కువవుతూంది. నాకు భయం ఎక్కువయింది. 'శాంతీ! నేను వెతకలేను. వాన పడిపోతోంది. పోదాం! వచ్చేయ్! వేగంగా వచ్చేయ్!' అని కేక పెట్టాను. శాంతి రాలేదు. అలా మూడు సార్లు పిలిచాను. శాంతి అలికిడి ఎక్కడా లేదు. నాకు భయంతో నిలువెల్లా వణుకు పట్టుకుంది.

'శాంతీ! శాంతీ!' అంటూ పేగులు తెగిపోయేలా కేకలు పెట్టుతూ ఆ దిబ్బల మధ్య పరుగెత్తాను. లోవ తెలియడం లేదు. వాన మొత్తేస్తోంది. మీద నుండి వస్తూన్న వర్షపునీరు దిబ్బల్లో పడి అన్ని లోవల్లోంచి ప్రవహించడం ప్రారంభించాయి. నాకు ప్రాణభయం పట్టుకుంది. ఎంతసేపు పిలిచినా సమాధానం రాలేదు. క్రమంగా నీళ్ళు సెలయేళ్ళ లోతులో ప్రవహించడం మొదలుపెట్టాయి. ఏం జరిగిందో ఊహించరాకుండా ఉంది. మరి అక్కడ నిలవలేక పోయాను.

ఒక వేళ శాంతి దిబ్బలు దాటి తోటలోకి చేరుకున్నాడేమో ననిపించింది. శక్తినంతా కూడదీసుకుని తోటలోకి పరుగెత్తాను. సరుగుడుతోట జడలదెయ్యంలా ఊగుతూంది. మృత్యుదేవత కంటి పాపల్లా మిణుగురులు మెరుస్తున్నాయి. నరకలోకపు బాండు మేళంలా కప్పలు గుండెలు బద్దలు చేస్తున్నాయి. స్వాగత గీతాల్లా కీచురాళ్ళు ఘోష పెట్టుతున్నాయి. అప్పటి నా పరిస్థితి నువ్వే ఊహించుకో.

'శాంతీ! శాంతీ!' అని గగ్గోలు పెట్టుతూ తోట దాటి, రోడ్డు మీంచి పరుగెత్తాను. ఎంత సేపు పరుగెత్తానో? ఎలాగైతేనేం, భీమునిపట్నం ఊళ్ళోకి చేరుకున్నాను, ఒళ్ళంతా తడిసి ముద్దయి పోయింది. భయంతో ప్రాణాలు పోతున్నాయి. శాంతి ఏమయ్యాడో తెలియదు. నా మనసు అతని కేదో అయిందని శంకించింది. మరొక ఆలోచన లేకుండా



వంట పని — చిత్రం—ఇ. గోపాలరావు (ప్రత్తిపాడు)

తిన్నగా పోలీసు స్టేషనుకు పోయి సబ్‌-ఇన్‌స్పెక్టరుకు జరిగిందంతా చెప్పాను. వాన ఆగిన వెంటనే ఒక జీపులో పోలీసులు, వాళ్ళతోబాటు నేను బయలు దేరి వెళ్ళాము. పోలీసుల్ని చూసి నలుగురు పల్లెవాళ్ళుకూడా వచ్చారు. అందరం ఆ ప్రదేశమంతా ఎంతో సేపు వెతికాము. చివరకు ఒక పల్లెవాడు నన్ను జరిగినది జరిగినట్టుచెప్పమన్నాడు. దుఃఖంలో మాట రాకపోయినా, ఎలాగో ఒక లాగ జరిగినదంతా అతనికి చెప్పాను. వెంటనే అతని కేదో అనుమానం కలిగింది. ఎఱ్ఱ మట్టిదిబ్బల నన్నింటినీ ఒక్కొక్కదాని దగ్గరికే పోయి పరీక్షగా చూడ్డం ప్రారంభించాడు. చివరకు ఒక దిబ్బ దగ్గర ఆగి అందర్నీ రమ్మని కేక పెట్టాడు. ఆ దిబ్బ కింది భాగమంతా కూలిపోయింది. ఆ మట్టి గబగబా తవ్వి చూశారు. అక్కడ నా 'శాంతి' శవం కనిపించింది నాకు లోకం కనిపించలేదు. ఆ మర్నాడు నాకు తెలిసింది. నువ్వు ఈ రోజు ఒక దిబ్బకింద బొరియలో కూర్చోబోయావే! అలాంటి బొరియలో శాంతి దాక్కున్నాడట. అప్పటికే ఎన్నో వర్షాలకు నాని ఉన్న ఆ దిబ్బ కింది భాగం అతని మీద కూలిపోయింది. అతను కదలలేక పోయాడు'' అంటూ ఆగిపోయింది కరుణ.

థెరిసా దుఃఖానికి అంతు లేదు. ''కరుణా! నీ ప్రేమ ఇంత ఘోరంగా విఫలమయిందా!'' అంటూ ఆమెను చుట్టుకుని భోరుమంది.

''కాదు, థెరూ! నా జీవితమే నాశనమయింది. అంతకు రెణ్ణెల్ల కిందట శ్రావణ మాసంలోనే మా పెళ్ళి జరిగింది. మా వాళ్ళందరూ సంస్కారం కలవాళ్ళు. వాళ్ళు నా బొట్టు చెరపనివ్వలేదు. గాజులు చిట్లనివ్వలేదు. మంగళసూత్రాలు తీసి పారేశారు. మళ్ళీ పెళ్ళి చేస్తామన్నారు. నా మనసు ఒప్పుకోలేదు. సంఘసేవలో జీవితం గడపాలనుకున్నాను. అది కేవలం ఆశయమే కాని, దాన్ని ఆచరించే శక్తి లేదు. బలహీనురాల్ని. చివరకు ఈ ఎమ్. ఎ. లో చేరాను'' అంది కరుణ.

థెరిసాకు చెవులు వినిపించడం లేదు. ఇన్నాళ్ళూ తన పక్కనున్న ప్రాణి ఇంత ఆరాటపడుతూందా అనుకుని నిశ్చేష్టురాలయింది.

''ఇప్పుడు చెప్పు, థెరూ, నాది సున్నిత హృదయ మంటావు, ఈ రోజు నీ వెంట మళ్ళీ ఆ ఎఱ్ఱమట్టి దిబ్బలకు రాగలిగానంటే నాదెంత కఠినహృదయమో తెలుస్తూంది కదూ!'' అంది జీవం లేని నవ్వుతో. ఆ మాట థెరిసాకు కశాఘాతంలా తగిలింది. *